కథాసంచిక తరువాయి

# శ్రీనివాసు

పులిపాక జగన్నాధరావు

ఆయనచేతిని నా హృదయానికి అదుముకున్నాను. పూర్తిగా జ్ఞానం తెలిసివుంటే నేనా పనిని ప్రాణంపోయినా చేసివుండను. దీనికంటె నా స్తనమపవిత్రమైనదికదూ. ఏమైనా చకచకా నా కళ్ళవెంట నీరు కారసాగింది. అవును! నా హృదయమే నాకు తెలీకుండా చెప్పకుండా తనను ఆయనకు యిచ్చివేసింది. అర్పణం చేసివేసింది.

ఆయనచేతిని స్థిరంగా వుంచలేదు. దానికని నాకు దేనికో నవ్వువచ్చింది. నేను పత్తుత్తైలాగా నవ్వాను. నేను స్నానంజేసి, అద్దంలో నా ముఖాన్ని, శరీరాన్ని చూసుకుని తిరిగి బట్ట కట్టుకుంటున్నట్లు, అప్పుడాయన చిన్నపిల్లవాడై పోరాడుతూ చాటుగా నావంక తొంగితొంగి చూసినట్లు నాకోతలంపు కలిగింది. నేను చక్కగా తృప్తితో, హృదయంతో యెంతోసేపు యీ తలంపుకు నవ్వుకున్నాను. ఆయన నా నవ్వును చూసి నన్ను పదేపదే తనకో ముద్దు యివ్వమని చాలా జాలికరంగా బతిమిలాడారు. ఎదురుగా పెద్ద అద్దం వున్నది.

నేను చీరను, రవికెను, విడిచివేసి నావైపుకు చూసుకున్నాను. అవును!—నా శరీరంలో పవిత్రమైన అంగం వొక్కటిలేదు. పెదవులు, నుదురు, చెక్కిళ్లు, స్తనాలు ముఖ్యాంగము, జఘనము అన్నీ అపవిత్రమైనవే. పోతే నేను నా పాదాలవంక చూశాను. అవిమాత్రం ఆత్మవలె, కళంకాన్నియేమీ అంటకవున్నై. కాని ఆయన్ను నా పాదాలను ముద్దుపెట్టుకోమని యెలాఅనను? ఏమైనా యెవరో అన్నట్లు ఉపాధులను చూపలేనివారు వృత్తులను మానమనటం యెందుకు? నన్ను యీడు రాగానే యీయనేమిటి యెవరు చేసుకున్నా వారిని నా ప్రేమలోను, సేవలోను ముంచియెత్తి వుండి వుండినా? ఆయన్నే దేవుడిగా పూజించేవుండనా? ఆయనకోసం నా అభిరుచులు, అభిప్రాయాలు మార్చుకుని ఆయన తోడునీడగా వుండివుండినా? మరీ యీయన అవుతే, యింత చక్కటి హృదయం, ఆత్మ, శరీరంగల మనిషే అవుతే—అసలు ఐక్యమే కానా? మా యీ వృత్తిని మానాలట!—మళ్ళీ ఉపాధులను తామేవీ చూపరు.

నన్ను నగ్నంగా చూడగానే ఆయన ఉద్రేకయిపోయారు కాని నేను 'వద్దు' అన్నాను...నేను అయిష్టతను తేలికగా నటిస్తూ—ఈసారి నా యీ నటనను హృదయం వున్నవాడూ, తెలివితేటలు కలవాడు మనిషన్న ప్రతివాడు మెచ్చుకోవాలి. ఆయన యెన్నో వేలను చూపి యిది ఊరికే కానుకగా యిస్తున్నానని తన్ను తప్పుగాఅర్థంచేసుకోవద్దని అన్నాడు. నేను 'వచ్చేజన్మాన...' అని యీ మాటలకు సమాధానంగా కాక అసలు విషయంమీద అంతా లోలోపల అనుకున్నట్లుగా వున్నాను.

నా యీ అస్ఫుటంగా వెలువడిన మాటలను ఆయన వినినట్లే వున్నారు. నా అంగాల దృశ్య


కథాంజలి

అన్ని హిగ్గిన్ బాథమ్సు బుక్ స్టాల్సు లోను దొరకును. వెల 0-2-0

తన ప్రతిగా ఆయనలో కలిగే సంచలనాన్ని, దాని ఫలితాన్ని ప్రమాదంతో కూడినదిగా భావించి నేను వెంటనే చీరను ధరించాను. ఆయన వున్నట్లుండి చప్పున నవ్వుతూ యిలా అన్నారు.:—'ఏ తల్లి కన్నది యింత చక్కదనం, ఆత్మహృదయం కల నిన్ను?'

ఆయన యీ మాటలను తలుచుకుంటూనే నేను దినాలను గడుపుతున్నాను. నాకివ్వి బంగారపు ఆభరణాలు, మాలాలు విలువగలిగినట్టివి. నేను జవాబుగా, అమ్మ తలుపుకు వచ్చింది కనుక నవ్వక యిలా చెప్పాను:—'ఇప్పుడు నాకు యిరవైయ్యేళ్లు, మరి నేను వృత్తిని ప్రారంభించి రెండేళ్ళు గడిచినై. అంటే పద్దెనిమిదేళ్ల వరకు అమ్మ జీవించే వున్నది. ఇక మరి అమ్మ జీవించివుండగా నా పాదాలకు పండు బాదమాకులు కూడ చాలా తేలికయిన తగని ఉపమానము. అంటే నేను మల్లెపూవుల పట్టు పరుపులో రాత్రింబవళ్ళు స్వప్నాలనుకంటూ.. మరి మీరు పొరబడబోకండి నేనప్పుడు యింత సుఖాన్ని అనుభవిస్తున్నానని అనుకోలేదు, సాధారణంగా విద్యార్థి యింతే. అతను పరీక్షరోజులలోని తన చదువును తరువాత సెలవులలో వర్ణించేటప్పుడు పొందే ఆనందంలో యెన్నోవంతూ ఆ రోజులలో పొందడు. నాస్థితి యిదికాకబోయినా ఊరికే పై ముక్కలు చెప్పాలని నాఆత్మ దేనికో చెబుతూంది. మరి యిక అమ్మవిషయానికి వస్తే ఆమెకు నామీద వున్న ప్రేమ యేతల్లికి యే కూతురిమీద వుండదని నేనను కాని వొకటిరెండు ముక్కలు మచ్చుకు చెబుతాను. ఈడువచ్చినతరువాత నేను వేరే ఆమెతో గాక వొక్కర్తెనే ఆమె యిష్టానికి వ్యతిరేకంగా పడుకోవటానికి యిచ్ఛగించినా ఆమె పల్లెత్తుమాట అనలేదు. ఆమె శాంతిసహనాలకు నాదృష్టిలో అట పట్టు. నేనూ ఆమె యిద్దరము వొకేచోట పడి సాధ్యమైనంతవరకు పడుకోవాలని ఆమె యిచ్ఛ. కాని మంచినీళ్ళకు నేను వొక రాత్రివేళ లేచి 'అమ్మా మంచినీళ్ళే' అని ప్రతిరాత్రి మొన్నమొన్నటి వరకు, అంటే ఆమె చనిపోయేముందు పడ్డ జబ్బు ముందువరకు ప్రతిరాత్రి విడిగా పక్కగదిలో పడుకున్న నేను అనేసరికి ఆమె యేవొక్కసారి బద్ధకించినట్లుగాని, నిరాకరించినట్లుగాని, నాకు గుర్తు చాలదు. కేవలము ఆమె నా పిలుపుకొరకే లేచి వుంటుందా, ఆపైనకావి ఆమెకు నిద్రపట్టదేమో అని నేననుకుంటూంటేదానిని,


యువ ప్రచురణాలు

ఒక్కొక్కటి పన్నెండణాలు

| | |
|---|---|
| పాపం! | 'చలం' |
| బ్రాహ్మణీకం | 'చలం' |
| హంపీకన్యలు | 'చలం' |
| మారుపేర్లు | కుటుంబరావు |
| బడదీదీ | శరత్ బాబు |
| తోకచుక్క | 'చక్రపాణి' |
| పాతమంగలి | 'చక్రపాణి' |
| వనఫూల్ రచనలు | 'చక్రపాణి' |
| ఆనావీలరు | 'సౌరీస్' |

ఒక్కొక్కటి రూపాయ

| | |
|---|---|
| మంగమ్మ (నాటకం) | 'చలం' |
| పతితకేశం (కావ్యం) | 'కవికోకిల' |

యువ బుక్ డిపో

48 ఆచారప్పన్ స్ట్రీటు, మద్రాసు & తెనాలి

'అమ్మా చెడ్డ కల వచ్చిందే' అని నేను యెప్పుడైనా నవ్వుతూ అంటే ఆమె అనేది:— "కలలు రావటం మన చేతిలో లేదు. దానికిని సుఖస్వప్నాలను కనటం యెంతో అదృష్టం. సామాన్యంగా వాళ్ళకు మనోవాక్కాయకర్మలచేత చెడును చేసి వుంటేనే కాని చెడ్డకలలు రావు. తల్లీ యెవరికీ మోసం చేయవద్దు..." అని.

నేను అన్నాన్ని పారవేస్తే ఆమె నవ్వుతూ అనేది:-ప్రపంచంలో క్షుద్బాధను మించిన బాధ యేదీ లేదు. దానికని అన్నాన్ని పారేసేవాళ్లను అన్నపూర్ణ యేమాత్రము క్షమించదు. 'అన్నమో రామచంద్రా' అని రాత్రిళ్లు యీ వచ్చిపోయే మనుష్యులు యెవరనుకున్నావు? క్రిందటి జన్మలో అన్నాన్ని పారేసినవాళ్లే:—ఎంతోమంది తృప్తిగా ఆహారం దొరకక బాధపడుతూవుంటారు దేశంలోను, ప్రపంచంలోను. అన్నపూర్ణ వాళ్ళ ఉసురంతా యీ అన్నాన్ని పారవేసేవాళ్లకు తగిలేటట్లు చేయటానికి కూడ వెనుదీయదు' అని. నా యీ శరీరం కలుషితాన్ని పెంపొందింప జేయకుండా అరికట్టబడటానికి కూడ ఆమే మూలము. నాకు వివాహం చేయాలని ఆమె చాలా ప్రయత్నం చేసింది. కాని ఆమెకోరిక నెరవేరలేదు. పెళ్ళి అయినట్లవుతే క్షీరసాగరంతోనే అయివుండేది. కాని క్షీరసాగరం అంత పెద్ద మేడలను, మిద్దెలను, భూముల్ని దాయాదులు చిల్లిగవ్వ లేకుండా మోసంతో అపహరించారు. క్షీరసాగరంకు నాయందు అతిమక్కువ. ఆమూ జేళ్లు... అంటే అతను తన చదువు మూడేళ్ళకు పూర్తిఅవుతుందని, ఆపైన ముహూర్తం పెట్టుకుందామని అమ్మతో నిశ్చయంగా వాగ్దానం చేశాడు...కాని తరువాత అతను బికారి అయిపోవటంతో అమ్మ యిష్టపడలేదు, ముఖ్యంగా అతనే యిష్టపడలేదు. కాని స్నేహాన్ని యిరువురమూ రెండు వైపులా బలంగా పట్టుకుని నడుపుతూనే వున్నాము. ఈ ముక్క దేనికంటే అతనికి తెలుసు. అతనిమీద నాకేమీ ఆపేక్ష లేదని. కాని నాకు అతను, అతనికి నేనూ అండ...'

తరువాత మరేమీ లేదు. నేనేమీ చెప్పదలచలేదు. అంతకన్న ఆయన వినదలచనూ లేదు. ఆయన చప్పున లేస్తూ 'మరయితే, నేను వెళ్తాను మాలా' అని అన్నారు.

నా హృదయం తిరిగి మరొక్కసారి దుర్బలమైపోయింది. ఆయనచేతిని తిరిగి, వుండీవుండని జ్ఞానదశలో నా హృదయానికి హత్తుకుని 'శ్రీనివాసూ'


## చేతిపనుల
## వర్తక రహస్య బోధిని

సబ్బులు, సెంటులు, పరిమళ తైలములు, బాణసంచ, అత్తరు, పన్నీరు, పప్పరమెంట్లు, మందులు మొదలగునవి సులభముగా తయారుచేయు పరిశ్రమలు 500 గలవు. ధర 1 రూపాయి, పోస్టుఖర్చులు 5 అణాలు.

### కుట్టుపని స్వబోధిని

కోట్లు, ట్రౌజర్లు, షర్టులు, జాకెట్లు కత్తిరించి కుట్టు క్రొత్తపద్ధతులు డ్రాయింగులతో గలదు. స్త్రీలు, పురుషులు, బాలికలు యీగ్రంథము చూచి సులభముగా నభ్యసించతగినది. ప్రతి దర్జీవారికిని ముఖ్యముగా చేతిలో వుండవలసిన పుస్తకము. ధర అ. 10.

మహారాజ పుస్తకశాల,

12, అరుణాచల మొదలివీధి, 18, పేటు, మద్రాసు.

అన్నాను. అంతేను. ఆదే తుదిసారి. ఆయన సమక్షాన ఆయనపేరున ఉచ్చరించటం, నా స్తనాలు పులకరించినై...కాని తేరుకోకలిగాను. మరి దైవబలంవల్లనేమో, ఆయన్ని అపవిత్రం చేయలేదు. చప్పున ఆయనచేతిని వదిలివేశాను.

నాకీ వృత్తిమీద మొదటినుంచీ రోతేను, కాని పొట్టకోసం చేయకతప్పిందికాదు. ఇప్పుడు ధనానికి లోటులేదు. మా రెండుజీవితాలు, నేనూ, క్షీరసాగరం...ఆ క్షీరసాగరం యేదో ఉద్యోగం చేస్తానని అంటున్నాడు, కనుక నేను కేవలం మరణం కోసం యెదురుతెన్నులుచూస్తున్నాను. ఈలోపల నాఆత్మసంతృప్తికి...రక్తం వొక్కసారే కళ్ళల్లో నుంచి పెదవుల్లోనుంచి లోపలికిపోకుండా వుండటానికి ఆయన్ని ప్రతిరోజూ వొక్కసారి...మరి యింక నేను మీకు కథ చెప్పలేను. అయినా చెప్పటానికి యేమీలేదు. ఐనా దేనికి చెప్పలేనంటే, అరుగో ఆయన కళాశాలకు పోవటానికి యిటే వస్తున్నారు....అరుగో, ఆయనే,... నేను వెయ్యి దేవుళ్ళకు యెప్పుడూ, నేను జీవించి వున్నంతవరకు ప్రతి క్షణం వచ్చే జన్మాన నన్ను స్త్రీనిగానే జన్మింపచేయాలని, నాకు ఆయనే భర్తగావాలని కోరుకునే ఆయన,...నా హృదయాన్ని యిట్టే వొక్క క్షణములో అపహరించిన ఆయన...ఆయనే, ఆయనే, ఆ చిన్నికళ్లు, పెదవులు, నుదురు, బుగ్గలు...ఆయనే యెలాపోతున్నారో, అప్పుడే దాటిపోయారు నన్ను ...మరి మీరు మాటలాడించవద్దు...ఆయన యెలా పోతున్నారో, అప్పుడే కనుచూపును దాటిపోయారే, ఆయనే...ఆయనే...


క్రొత్తరకాలు! క్రొత్తపోకడ!




స్వచ్ఛమైన బంగారు - కావలసినప్పుడు
సొమ్ము చేసుకొనవచ్చును.




ఈ నగలు బంగారు గిల్టువేసినవికావు. లోపల లోహపు కడ్డీమీద బంగారు రేకు తొడగబడియుంది. కొద్దిఖరీదుకే ఎక్కువ నగలొస్తాయి,

మా కొతాదారులందరు మా టి. సి. యన్. గోల్డన్ మెటల్ నగలు కొన్నిసంవత్సరాలయిన తరువాత కాంతి తగ్గుచున్నవి. అట్లులేకుండా చేయవలసినదని వ్రాసిన లేఖలకు మేము యీ జీవితకాల గ్యారంటీ రకాలను ప్రచారంలోకి పెట్టుతున్నాము.




ఉంగరము ఒకటికి రు. 10-0-0, వి. పి చార్జీ 0-10-0.




పెద్దసైజు గాజులు 2 అం. పైబడినవి జత 1-కి రూ. 20-0-0
మధ్యమసైజు గాజులు $1\frac{3}{4}$ అం. నుండి 2 అం. లోపల జత 1-కి రూ. 15-0-0
బేబీ సైజు గాజులు $1\frac{3}{4}$ అం. లోపల జత 1-కి రూ. 10-0-0
వి. పి. చార్జీలు 0-10-0.

టి. సి. నాగలింగప్ప అండ్ కో.,

280, వాల్‌టాక్సురోడ్, పి. టి., మద్రాసు.

ఏజంటు :—శ్రీ కె. యన్. తిమ్మప్ప శెట్టిగారు, గోపువారి బిల్డింగ్సు, బెజవాడ.